
ప్రజాశక్తి

బుధవారం 18 జూన్ 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





కాలువ పూడిక తీత పనులు చేపట్టాలి

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్

స్పెషల్ డీసిల్టేషన్ కార్యక్రమం ద్వారా కాలువలలోని పూడికను రోబో సహాయంతో వెంటనే తీయాలని నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం 45 వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ ఆఫీసులో ఉదయం మస్టర్ కి హాజరై పబ్లిక్ హెల్త్ వర్కర్ల హాజరు తీసుకున్నారు. సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్ తో మాట్లాడి వారి వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను అడిగి తెలుసుకున్నారు, ప్రతి చెత్త వాహనమూ కనీసం మూడు ట్రిప్పులు తిరగాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు డంప్ యార్డ్ కు తరలించాలని తెలిపారు.దోమల నియంత్రణకు వార్డుల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్లను ఆదేశించారు.17వ వార్డుకు సకాలంలో హాజరై చెత్త మొత్తం తరలించేంతవరకు ట్రిప్పులు వేయాలని ఆదేశించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్

లో గ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-కందుకూరు

లో గ్రేడ్ పొగాకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి కొనుగోలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కందుకూరు 27వ వేలం కేంద్రం వద్ద పొగాకు రైతుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాల వెంకటరమణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య మాట్లాడుతూ పొగాకు రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంట పండిస్తే తీరా అమ్ముకోబోయేసరికి మార్కెట్లో ధరలు నిరాశ పరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ 280 వేస్తున్నారు. లో గ్రేడ్ ధరలు ఒకటి అర, రూ 180 కి కొనుగోలు చేస్తున్నారు. లేదంటే నోబిడ్ చేస్తున్నారు. దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిట్టుబాటు ధరల కోసం 300 కోట్ల రూపాయలు కేటాయించమని కేంద్ర ప్రభుత్వాన్ని అడగడం హర్షం వ్యక్తం చేశారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కోసం రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా రైతు సంఘాలు అన్నీ కూడా ఐక్యంగా నిలబడి ముఖ్యమంత్రి దగ్గరకి రాయబారం వెళ్దామని ఆయన అన్నారు. రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య మాట్లాడుతూ 1984లో పొగాకు గిట్టుబాటు ధర కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆ పోరాట ఫలితమే పొగాకు బోర్డు ఏర్పడిందని ఆయన అన్నారు. సంక్షోభ సమయంలో ప్రభుత్వం ఎస్ టి సి ని రంగంలోకి దించి పొగాకు రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సంవత్సరం కూడా ఐ టి సి లాంటి గుత్త సంస్థలతో మిలాఖత్ కాకుండా పొగాకు రైతుల కోసం, గిట్టుబాటు ధర కోసం, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో రైతు సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి కె వీరారెడ్డి, సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు, సిపిఎం నాయకులు, ఎస్ ఎ గౌస్, జి వెంకటేశ్వర్లు, జీవీ వి కుమార్, తానికొండ రమణయ్య, రైతులు వలేటి నరసింహం, అల్లం సుమతి, బ్రహ్మయ్య, మాదాల మాధవ, మామిళ్ళపల్లి మాధవ, దామా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య

నవాబుపేటలో దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు: స్థానిక నవాబ్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు హత్యకు గురయ్యాడు.మంగళవారం స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంలో జె హిందు అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.వివరాల్లోకి వెళితే, మద్యం మత్తులో జరిగిన ఘర్షణ పరస్పర దాడుల్లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై స్థానికులు షాక్కు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన జరిగిన స్థలానికి సీఐ వేణుగోపాల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తో చేరుకున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ డి.ఎస్.పి ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు.సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విజయవాడ రైల్వే స్టేషన్లో నిందితులు జయవర్ధన్, రామ్ కేసరిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మేయర్ను కలిసిన ఉద్యానవన ఎడి

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్ నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ ని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఎమ్.వి నరసింహారావు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం లోని మేయర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నూతనంగా చేపట్టనున్న ప్రణాళికలపై చర్చించారు.

దోమల నివారణకు చర్యలు


ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ నందన్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైను కాలువల పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలనని అన్నారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 23వ డివిజన్ పడారుపల్లి, పరిసర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. దోమల నివారణకు ఫాగింగ్, కాలువల్లో మందు పిచికారి వంటి చర్యలను క్రమం తప్పకుండా అన్ని డివిజనుల్లో చేపట్టేలా పర్యవేక్షించాలని సూచించారు. డ్రైను కాలువలలో ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను వేయకుండా మురుగునీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డ్రైను కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన ర్యాంపులు, మెట్ల నిర్మాణాలను తొలగించి అవసరమైన చోట సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని ఆదేశించారు. కొన్ని భవనాలకు కొలతలు వేయించి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. రీ సర్వే ద్వారా ఆస్థి పన్నుల సవరణలు చేయాలని అన్నారు.కొలతలకు, పన్ను డిమాండ్ కు మధ్య వ్యత్యాసం ఉండకూడదని సూచించారు. అనధికారంగా జరుపుతున్న నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి ఛార్జ్ షీట్ ఫైల్ చేయాలని సూచించారు.



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

యుపిహెచ్సిలో మలేరియా అధికారి తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారి

ప్రజాశక్తి -నెల్లూరు

స్థానిక పోలేరమ్మ చెట్టు వీధి ప్రాంతంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి ఈ. హుస్సేనమ్మ తనిఖీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరాలతో ఎంత మంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.ఏఎన్ఎం లు వారి పరిధిలో జ్వర పీడితుల రక్తనమునాలను సేకరిస్తున్నారా లేదా అని వాటిని సకాలంలో ల్యాబ్ కు చేరవేసి మలేరియా వ్యాధిని నిర్ధారణ చేసేదానికి ల్యాబ్ టెక్నీషియన్ రక్తనమునాలను చూస్తున్నారా అని ప్రశ్నించారు. తదుపరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయం ప్రాంతంలో మలేరియా నివారణ మహోత్సవంలో భాగంగా అక్కడ ప్రజలతో దోమల వలన వచ్చే వ్యాధులను ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగు వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తెలియజేశారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ట్రే డే పాటించమని ప్రజలకు తెలియజేసినారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవద్దని అలా నిల్వ చేసుకున్న నీటిలో దోమ గుడ్డు లార్వా ఉంటాయని అందువలన ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే లో భాగంగా ప్రజలందరూ భాగస్వాములై నీరు నిల్వ లేకుండా ఇంటి చుట్టుపక్కల శుభ్రంగా ఉంచుకునేటట్టు ప్రతి ఒక్కరూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో యుపి హెచ్ సి డాక్టర్,సిఓ, సచివాలయ ఏఎన్ఎం, ఆశా, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరుకందుకూరు పట్టణ టిడిపి ముస్లిం నాయకులు ఆధ్వర్యంలో కందుకూరు పట్టణ ఎస్ఐ శివ నాగరాజును ముస్లిం, టిడిపి మైనార్టీ మాజీఅధ్యక్షుడు షేక్ ఖాదర్ బాషా ,పట్టణ టిడిపి ఉపాధ్యక్షుడు సయ్యద్ జియావుద్దీన్ ,16 వార్డు అధ్యక్షులు షేక్ ఖలీల్ భాషా, 6 వార్డ్ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్ భాషా ,16 వార్డు సయ్యద్ గౌస్ బాషా ,టిడిపి సీనియర్ నాయకులు షేక్. కుద్దూస్ ,టిడిపి సీనియర్ నాయకుడు షేక్ రహమతుల్లా, షేక్ ఆరిఫ్. షేక్ నాయబ్ రసూల్. సయ్యద్ ఖాదర్ వలీలు మంగళవారం మర్యదపూర్వకంగా కలిశారు. ఎస్ఐ శివనాగరాజుని ఈ సందర్భంగా సత్కరించారు.




ఎస్ఐకు సన్మానం చేస్తున్న ముస్లిం నాయకులు

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్

ఎన్నికల సంఘం సూచనల మేరకు నగర నియోజకవర్గం - 117 పరిధిలో అర్హులందరికీ ఓటరు నమోదు నిరంతర ప్రక్రియను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిం చాలని నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వై.ఓ నందన్ తెలిపారు.కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. డిగ్రీ స్థాయి కళాశాలల్లో ఓటరుగా అర్హులైన విద్యార్థు లందరికీ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఎస్-ఎస్ఆర్-2025కి సంబంధించిన క్లెయిమ్లు, అభ్యంతరాలపై దృష్టి పెడతామని తెలిపారు.పోలింగ్ స్టేషన్లలో 800 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా, ప్రతి ఓటరు వారి నివాసానికి 2 కి.మీ.లోపు ఉండేలా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయబడతాయని ఈ.ఆర్.ఓ వివరించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, 117- నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ షఫీ మాలిక్, నెల్లూరు అర్బన్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఆనంద్ రావు, నెల్లూరు నగర పాలక సంస్థ ఎన్నికల విభాగం సూపర్ ఇంటెండెంట్ పద్మావతి, చక్రపాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నందన్



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

' వెన్నుపోటు ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు: చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం సంవత్సరకాలం పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వైసిపి రూపొందించిన జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం(వెన్నుపోటు) అనే పుస్తకం మంగళవారం ఉదయం కందుకూరు వైసిపి కార్యాలయంలో వైసీపీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరు తోటి 5 కోట్ల మంది ఆంధ్రులను చంద్రబాబు నాయుడు మోసం చేశాడని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను గాలికి వదిలేశారని విమర్శించారు.అభివృద్ధి సంక్షేమం పూర్తిగా కుంటూ పడిందని, మహిళలు ,దళితులు పట్ల అత్యాచారాలు కొనసాగుతున్నాయన్నారు. రాజకీయంగా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు సోషల్ మీడియాలో ప్రశ్నించిన వారికి ప్రజాస్వామ్య రక్షణ కరువైందని విమర్శించారు. ఈ ఆటవిక పాలనలో అశాంతి అరాచకం ప్రబలన్నిందని అఘాయిత్యాలు వేధింపులు అన్యాయం దుర్మార్గం అబద్ధాలు విష ప్రచారం అంతులేని అవినీతి ఉన్మాద రాజకీయాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని అన్నారు. విద్య వైద్యం వ్యవసాయం అడుగంటి పోయాయని రాష్ట్రంలో కక్ష సాధింపు పరిపాలన తప్ప మరి ఏమి జరగటం లేదని తీవ్ర విమర్శలు చేశారు. ఈ సంవత్సరకాలంలో జరిగిన పరిపాలన విధానాన్ని ఈ పుస్తకములో ప్రచురించి ప్రజలకు తెలియజేసి చైతన్యవంతం చేస్తున్నామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల కొండయ్య, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షులు రావులకొల్లు బ్రహ్మానందం, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, మండల అధ్యక్షుడు ఈదర వెంకట రమేష్, రాష్ట్ర నాయకులు గణేశం గంగిరెడ్డి, దాసరి మాలాద్రి, జిల్లా సెక్రెటరీ చీమల వెంకటరాజా, గ్రీవెన్స్ అధ్యక్షులు యరమాల నాగభూషణం, అంగనవాడి అధ్యక్షురాలు దేవరకొండ ఆదిలక్ష్మి, పట్టణ నాయకులు తలపనేని గోపి, యడ్ల మాధవరెడ్డి, సీనియర్ నాయకులు రేనమాల అయ్యన్న, షేక్ దస్తగిరి బాబు, షేక్ రహీం, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

పలు ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూళ్ల చేస్తున్నారని, ప్రభుత్వం అరికట్టాలని అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. స్థానిక జర్నలిస్టు భవన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం జిల్లా వ్యాప్తంగా అనేక ప్రయివేటు విద్యాసంస్థలు పుస్తకాలు అధిక ధరలతో విద్యార్థులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అలాగే ఫీజులను ఆకాశాన్నంటే రీతిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పెంచారని ఆరోపించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తగు మౌలిక వసతులను ఆయా విద్యా సంస్థలు ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడే విద్యాసంస్థల పై తగు చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కోరారు.

డిడి సదారావుకు సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

ఐఅండ్ పిఆర్ డిడి కె.సదారావును, జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రెస్ క్లబ్లో మంగళవారం జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తొలుత సదారావుకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి, జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సదారావు మాట్లాడుతూ తాను గత రెండు సంవత్సరాలుగా నెల్లూరు జిల్లాలో విధులు నిర్వహించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ. జయప్రకాష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రమేష్, ఏపీయూడబ్ల్యూజే నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు దయాశంకర్, నాగరాజు, కోశాధికారి హనోక్, కార్యవర్గ సభ్యులు ప్రతాప్, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి ఎనోష్ మస్తాన్, కోశాధికారి సునీల్, సీనియర్ పాత్రికేయులు సుబ్బయ్య, సుధాకర్, సరస్వతి, మణి, ధనలక్ష్మి తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

మహేష్పై దాడి అమానుషం

ప్రజాశక్తి-నెల్లూరు: వీరంపల్లి పంచాయతీ కొండుపాలెం గ్రామం లోని దళితుడైన ఇనగలూరు మహేష్ పై మనుబోలు ఎస్ఐ ఇంటరాగేషన్ పేరుతో విపరీతంగా కొట్టి హింసించడాన్ని ఖండిస్తున్నామని కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం తెలిపారు.మనుబోలు మండలం, వీరంపల్లి పంచాయతీ కొండు పాలెం గ్రామం దళిత వాడలో ఇనగలూరు మహేష్ గుండెపాక మీరయ్య ౹ కోడె దూడను దొంగలించాడన్న నెపంతో మనుబోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివ రాకేష్ కుమార్ చట్ట ప్రకారం శిక్ష శిక్షించాల్సింది పోయి గత ఐదు రోజులుగా జై భీమ్ సినిమా లో చూపించిన విధంగా మహేష్ ని పోలీస్ స్టేషన్లో పెట్టి విపరీతంగా కొట్టి గుండెలపై బూటు కాళ్లతో తన్నడంతో మహేష్ కి ఒళ్లంతా హూనమైంది. నడవలేకపోవడంతో గూడూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నా..నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ప్రస్తుతం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకుంటున్నాడు. చికిత్స పొందుతున్న మహేష్ ను కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య ఆలూరు తిరుపాలు, జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళ పుల్లయ్య, మనుబోలు మండల నాయకులు తలారి దేవదానం, నెల్లూరు లోని జి జి హెచ్ కి వెళ్లి మహేష్ని పరామర్శించారు. డ్యూటీ డాక్టర్ తో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ కోడె దూడను దొంగిలించాడన్న నెపంతో కోడెదూడ కలవారు కేసు వాపసు తీసుకుంటానన్న ప్పటికీ ఎస్ఐ ఒప్పుకోలేదన్నారు. గత ఐదు రోజులుగా మనుబోలు ఎస్సై శివ రాకేష్ కుమార్ పోలీస్ స్టేషన్ లో ఇంటరాగేషన్ పేరుతో విపరీతంగా కొట్టారన్నారు. బూటు కాళ్లతో గుండెలపైన శరీరంపై న విపరీతంగా దాడి చేశారన్నారు. దీంతో మహేష్ నడవలేక ఒళ్లంతా వాచిపోయి గూడూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం చేయించుకొని నయం కాకపోవడంతో నెల్లూరు జి జి హెచ్ లో చేరి వైద్యం చేయించుకుంటున్నాడన్నారు. స్టేషన్ ఎస్సై మీ అవ్వ గుండెపాక మీర మ్మ ఆనాల శీ నయ్యపై పెట్టిన అట్రాసిటీస్ కేసు రాజీ చేసుకునే వరకు నీకు ఇదే గతి పడుతుందన్నారని బాధితుడు మహేష్ తెలిపాడనీ అన్నారు. స్టేషన్ ఎస్ఐ శివ రాకేష్ కుమార్ పై డిఎస్పి విచారణ జరిపి బాధితునికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బట్టా పెద్దబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడును పరామర్శిస్తున్న నాయకులు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: వలేటివారిపాలెం హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుండి సరఫరా అయిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను గ్రామస్తుల తో కలిసి హై స్కూల్ హెచ్ఎం కమల్ కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ జెడ్పిటిసి సభ్యులు కూచిపూడి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం కమల్ కుమార్ తో పాటు గ్రామస్తులు వలేటి మధుసూదన్ రావు, కాకుమాని ఆంజనేయులు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, హై స్కూల్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి, ఎంఈఓ మల్లికార్జునరావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న దృశ్యం

నగరంలో కేంద్ర జల వనరుల శాఖ బృందం పర్యటన

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ : నీటి నిర్వహణలో నెల్లూరు నగర పాలక సంస్థ పనితీరును పరిశీలించేందుకు కేంద్ర జల వనరుల శాఖ బంద సభ్యులు కొల్లి రాంబాబు, డి. ప్రదీప్ కుమార్ తదితరులు గత రెండు రోజులుగా సంగం మండలం మహమ్మాదాపురంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, నెల్లూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ లు, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలో నీటి నిర్వహణ పనులను 6వ జాతీయ జల పురస్కారానికి ఎంపిక చేయడానికి పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు.



సమీక్ష సమావేశంలో ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కందుకూరు: విజయనగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈనె 21న విశాఖ పట్టణం లో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లపై విజయనగరం కలెక్టరేట్లో సమీక్షా సమావేశం ంగళవారం నిర్వహించబడింది.ఈ సమీక్షా సమావేశం లో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి ,గ, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఇతర శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు తో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వృథాగా నీరు..

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు పట్టణం పెద్ద మసీదు వద్ద ఉన్న దక్షిణం బజారు లో రక్షిత మంచినీటి పథకం పైప్ లైన్ పగిలి నీరు వధాగా రోడ్లపై ప్రవహిస్తుంది. పది రోజుల క్రితం పై కు రంధ్రం పడి నీరు వృథాగా పోతుంది. పైప్ లైన్ నుంచి వస్తున్న నీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు కూడా ఇబ్బందికరంగా మారింది. ఈ విషయం మున్సిపాలిటీ వారికి సమాచారం ఇచ్చారో లేదో కానీ పది రోజులుగా రిపేరు మాత్రం జరగలేదు. నీరు వధాగా పోవడం చూసిన ప్రజలు బాధపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే పైప్ లైన్ రిపేరు చేసి నీటి వధా అని అరికట్టాలని కందుకూరు పెద్ద బజారులోని మహాత్మా గాంధీ విగ్రహ నిర్వాహకులు పబ్బిశెట్టి వరదరాజ అధికారులను ఒక ప్రకటనలో కోరారు.



మాట్లాడుతున్న ఎడిఎ అనసూయ

పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు మండలం పలుకూరు,పందలపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరు ఏ డి ఏ అనసూయ పాల్గొని మాట్లాడుతూ అర్హులైన రైతులందరినీ అన్నదాత సుఖీభవ పథకం లో లబ్దిదారులను చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరేదేశించిన మేరకు నగదు సహాయం ప్రతి అర్హుడు పొందుతారన్నారు. మండల వ్యసాయాధికారి అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ అందరూ రైతులకు ఇ కెవెసి పూర్తిఅయిందని తెలిపారు. మండలం లో ఇ కెవెసి 240 మంది మాత్రమే చేయించుకోవాల్సి ఉండగా వాళ్ళని ప్రతి గ్రామ వ్యవసాయ సహాకులు వారిని నేరుగా సంప్రదిస్తారని తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఆపండి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలోని శ్రీ అంకమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేంటనే ఆపివేయాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం కోరారు. మంగళవారం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతానికి శివరాం వచ్చారు. నిర్మాణ పనులు వెంటనే ఆపాలని అక్కడ పనులు చేస్తున్న వారిపై అగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయ ఆదాయం కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం గత నెల 24న నిర్వహించారు. బహిరంగ వేలం ద్వారా గదులను దక్కించుకున్న వ్యక్తులు నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. నిర్మాణాల సందర్భంగా దేవాలయాలలో ఉన్న చెట్లను తొలగించకుండా చూడాలని శివరాం ఇటీవల కోరారు. అయితే సోమవారం దేవాలయం వద్ద జరిగిన సమావేశంలో అంకమ్మ తల్లి తిరుణాల చేయాలని నిర్ణయించారు. ఎప్పుడు చేయాలనే దాని విషయంలో క్లారిటీ లేదు. అయితే తిరణాల చేయాలి కాబట్టి షాపింగ్ కాంప్లెక్స్ పనులు నిలుపుదల చేయాలని కొందరు అనగా నిర్మాణ పనులు తిరుణాలకు అర్థం కాదని మరికొందరు అన్నారు. అయితే దివి శివరాం మంగళవారం దేవాలయం వద్ద కొచ్చు నిర్మాణ పనులు చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిలుపుదల చేయాలని గట్టిగానే చెప్పారు. శివరాం నిర్మాణ పనులు ఆపమని చెప్పగా అప్పుడు ఒకవైపు మాత్రమే పనులు చేస్తున్న వారు ఆయన వెళ్లిపోయిన తర్వాత మిగిలిన గదుల పనులు కూడా ప్రారంభించటం విశేషం. లక్షల రూపాయలు డిపాజిట్లు కట్టి వేలం పాడుకున్న తమ గదులు నిర్మాణం ఎక్కడ నిలిచిపోతుందనే ఆందోళనతో హడావుడిగా నిర్మాణ పనులు ప్రారంభించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించి గదులను యాలం పాట దారులకి అప్పగించిన తర్వాత రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈనెల 7న శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇప్పుడు నిర్మాణ పనులు ఆపమనడం ఏమిటని వేలం పాట పాడిన వారు ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. నిర్మాణ పనులు జరుగుతాయా లేదా అనేది వేచి చూడాలి.



పనులను ప్రారంభిస్తున్న కార్యక్రమంలో మంత్రి ఆనం (ఫైల్)

20న జరిగే సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కందుకూరు

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించటం జరుగుతుందని రైతులు ఆ సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె వీరారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 26, 27 పొగాకు వేలం కేంద్రంలో సదస్సును ఉద్దేశించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు కంపెనీలు సిండికేట్ గా ఏర్పడి అంతర్జాతీయంగా ఉత్పత్తి పెరిగి ధరలు తగ్గాయని, ఆర్డర్లు ఖరారు కాలేదని, ప్రస్తుత ధరల కన్నా ఎక్కువ కొనలేమని కుంటి సాకులు చెప్పి రైతులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. గత సంవత్సరం హై గ్రేడ్ పొగాకు కింటా 36వేలకు కొనుగోలు చేశారని ప్రస్తుతం 28 వేల రూపాయలు కొనుగోలు చేస్తున్నారని, మీడియం గ్రేడ్ 35 వేలకు కొనుగోలు చేస్తే ప్రస్తుతం 25000 లోపే కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. లో గ్రేడ్ పొగాకైతే అసలు పూర్తిగా కొనుగోలు చేయటమే మానేశారని ఆయన అన్నారు. 30 శాతానికి పైగా నోబిడ్లు చేస్తున్నారని అన్నారు.ఈ సంవత్సరం మార్చి ఆఖరుకు సరాసరి ధర కేజీ 264.66 ఉంటే జూన్ 9వ తేదీ నాటికి సరాసరి కేజీ 243.51 ధరలు పతనమవుతున్నాయని అన్నారు. రోజు రోజుకు ధరలు తగ్గి రైతులకు నష్టాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే రైతులకు పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని మంత్రులను కలవడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. పొగాకు రైతుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఒంగోలులో జరిగే రైతు సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సదస్సులో జిల్లాలోని అన్ని రైతు సంఘాల నాయకులు, పొగాకు బోర్డు మాజీ సభ్యులు, రైతు శ్రేయోభిలాషులు పాల్గొంటున్నారని తెలిపారు. రైతులు తమ సమస్య పరిష్కారానికి నడుం బిగిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని ఆ పరిష్కారం కోసమే ఈ సదస్సు వేదిక అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వై. ఆనందమోహన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులను కోరుతున్న కె వీరారెడ్డి

ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తాం..



ప్రజాశక్తి-కొడవలూరు

ప్రజా సంక్షేమం కోసం పనిచేసే పార్టీ వైసిపి అని బెదిరింపులకు భయపడమని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు అన్నారు. ఆయన మంగళవారం నార్త్ రాజుపాళెంలోని తన గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 4న వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి విజయవంతం చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత వైసిపి పాలనలో 9 హామీలతో అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 36 సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలకు నేరుగా తీసుకెళ్లారని, నేడు వైసిపి సర్పంచులను బెదిరించి, చెక్ పవర్ రద్దు చేస్తామని బూటకపు మాటలతో నేడు ఎంతోమంది సర్పంచులను టిడిపిలోకి ఆహ్వానం పలికారని, అదేవిధంగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా భావించి పనిచేస్తున్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పైన అనైతిక వ్యాఖ్యలు చేయడం టిడిపి సభ్యులకు తగదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొమ్మ సుధీర్, కొవూరు నియోజకవర్గం 5 మండలాల అధ్యక్షులు, కాటంరెడ్డి నవీన్ రెడ్డి, చెర్లో సతీష్ రెడ్డి, చిమట శేషగిరి బాబు, ఆత్మకూరి అనూప్ రెడ్డి, గొల్లపల్లి విజయ్ కుమార్, ఎంపిపి గాలి జ్యోతి, కొమరగిరి శ్రీలత, షాహుల్, బట్టేపాటి నరేందర్ రెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కొండ శ్రీనివాసులు రెడ్డి, మాణిక్యరావు, సాయి, కొవూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు అనపల్లి ఉదయభాస్కర్, తాటిపర్తి భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించాలని సంతకాల సేకరణ



ప్రజాశక్తి-అనంతసాగరం : స్థానిక బిసి కాలనీకి వెళ్లే దారిలో వర్షం పడితే నీళ్లు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ వెళ్లే దారిలో కెనరా బ్యాంక్, ప్రభుత్వ స్కూల్ ఉన్నందున అటు వెళ్లాలంటే భయపడుతున్నారు. వర్షపు నీళ్లు నిల్వలేకుండా బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు నిర్మించాలని కోరుతూ కాలనీ లోని ప్రతి ఇంటికి వెళ్లి సిపిఎం ఆధ్వర్యంలో సంతకాలు సేకరించి గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఒ, ఎంపిటిసి 1, ఎంపిటిసి 2 లకు అందజేస్తామని కలిసి వినతి పత్రాలను అందజేశారు.

శ్మశానవాటికల్లో పిచ్చిమొక్కలు తొలగించాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని హిందూ శ్మశాన వాటిక, సుల్తాన్ షాహిద్ దర్గాలోని శ్మశాన వాటికలలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాలని పలువురు నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ శ్మశానవాటికలలో జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు రోడ్డును వేసి తాగునీరు, ప్రజల సౌకర్యార్థం విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ఎక్కువ మంది పేదలు ఉపయోగించే బొగ్గేరు గట్టున ఉన్న శ్మశానాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు సిపిఎం పట్టణ కార్యదర్శి దేవిద్ రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సందాని, ఆవాజ్ నాయకులు యస్దాని, శ్రీహరి, జిలాని, నాగయ్య, లక్ష్మయ్య, శేషయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్ బాషాకు ఘన నివాళులు

ప్రజాశక్తి-కావలి : తెలుగుదేశం పార్టీ పట్టణ నాయకులు, తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా (బుజ్జు) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సూచనల మేరకు మంగళవారం కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఖాదర్ బాషా చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ముస్లింల అభ్యున్నతికి, పార్టీకి ఖాదర్ బాషా చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఒక గొప్ప నాయకుడిని తెలుగుదేశం పార్టీ కోల్పోవడం జరిగిందని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిశోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, దావులూరి దేవకుమార్, శానం హరి, బొట్లగుంట శ్రీహరి నాయుడు, కావలి పట్టణ మహిళా అధ్యక్షురాలు ఆరయ బేగం, రఫీ, కరిక్, రహీం, మస్తాన్, నారాయణ, ఆత్మకూరు నాగల్లు, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, ముస్లిం నేతలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని చిలకలమర్రి సచివాలయంలో జరుగుతున్న ఎస్‌టి స్పెషల్ ఆధార్ డ్రైవ్‌ను ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు. చిలకలమర్రి, బొమ్మవరం, కామిరెడ్డిపాడు సచివాలయాల పరిధిలోని ఎస్‌టి కులాలకి వారికి ఆధార్ కార్డులు లేనట్లయితే వారందరూ ఈ క్యాంపును ఉపయోగించుకొని ఆధార్ కార్డులు పొందవచ్చన్నారు. నేడు అనంతసాగరంలోను, 19న సోమశిల, 20న ఉప్పలపాడు సచివాలయంలో ఎస్‌టిలకు స్పెషల్ ఆధార్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

రూ.25వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి నిత్యాన్నదాత, సాంబశివ ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సహాయం అందచేశారు. నెల్లూరు - ముంబాయి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మతి చెందిన వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరి కుటుంబాలకు రూ.25వేల వంతున ఆర్థిక సహాయం అందించిన ఆయన తీవ్రంగా గాయపడిన 10వ తేదీన మృతి చెందిన సలీమ్ కుటుంబానికి రూ.25వేల వంతున ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో వారి కుటుంబాలకి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఆయనవెంట బిజెపి సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ శివకోటిరెడ్డి, ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, ట్రస్టు సభ్యులు రాంపల్లి ప్రసాద్ రెడ్డి, శేషారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆటపాటలతో విద్యనందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటల పాటలతో పాటు విద్య నేర్పించాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్.సునీల తెలిపారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో వరికుంటపాడు దుత్తలూరు మండలాల అంగన్‌వాడీలకు పిపి - 1, పిపి - 2 పుస్తకాలతో పాటు కలల పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు సకాలంలో ప్రభుత్వం అందించే పోషక పదార్థాలు అందజేయాలన్నారు. రికార్డులను ప్రతినిత్యం అప్డేట్ చేసుకుంటూ పిల్లల హాజరు శాతాన్ని తగ్గకుండా చూసుకోవాలన్నారు.

వ్యవసాయాధికారిణి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల నూతన వ్యవసాయాధికారిణిగా ఎస్.కవిత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సూళ్లూరుపేట మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మర్రిపాడుకు వచ్చారు. మర్రిపాడులో వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్ బదిలీపై జిల్లా వనరుల శాఖ టెక్నికల్ ఏఓగా వెళ్లారు.



అదుపుతప్పిన మినీ ట్రక్

- వాహనం ఢీ కొట్టడంతో షాపులోని దంపతులు మృతి

ప్రజాశక్తి-దుత్తలూరు : దుత్తలూరు మండలం బ్రహ్మేశ్వరం వద్ద మంగళవారం ఉదయం మినీ ట్రక్ అదుపు తప్పి పక్కన ఉన్న షాపులోకి దూసుకు వెళ్లడంతో, షాపులోని దంపతులు మతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు మేరకు బ్రహ్మేశ్వరం కు చెందిన పరుచూరి వెంకటేశ్వర్లు (62), పరుచూరి స్వర్ణలత (57) సంవత్సరాల వయస్సు ఉన్న భార్య భర్తలు మృతి చెందారు. ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే దుత్తలూరు ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద బాధితులను 108 సహాయంతో ఉదయగిరి ప్రభుత్వ హాస్పటల్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉదయగిరి’లో అపరిశుభ్రత

ప్రజాశక్తి - ఉదయగిరి

స్వచ్ఛంగా ఆరోగ్యవంతంగా జీవించే మానవ హక్కు ఉదయగిరి పంచాయతీలో కాల రాయబడుతుందని టిడిపి నాయకులు గాజుల షర్ఫుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ స్థానిక పట్టణం చెత్తా చెదారంతో పరిసరాలు, మురుగు నిండిన కాలువలతో దుర్గంధంతో వెదజల్లుతుండడంతో వీధుల్లోకి రావాలంటే ముక్కులు మూసుకుని రావాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకుల నిర్లక్ష్యంతో వీధుల్లో కుప్పతొట్లు ఏర్పాటు లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త నిండిపోయి దుర్గంధం వెదజల్లుతూ దోమలకు ఆవాసాలుగా మారి అనారోగ్యాలకు కారణం అవుతుందన్నారు. పలుమార్లు పంచాయతీ పాలకులకు విజ్ఞప్తి చేశామని మండల అభివృద్ధి అధికారికి తదుపరి ఫిర్యాదు చెత్త కుండీలు ఏర్పాటు చేయమని ఎన్ని పర్యాయాలు విజ్ఞప్తి చేసిన ఫలితం లేకపోవడంతో తానే స్వయంగా తన సొంత నిధులతో ప్రయోగాత్మకంగా రెండు నీల్ కమల్ ప్లాస్టిక్ తొట్లను చెత్త వేసేందుకు సాధన స్కూల్ ఇంకా వెళ్లే రెడ్డి గారి బాయి దగ్గర, మరొకచోట రెండు ప్లాస్టిక్ తొట్లను ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు ముఖ్యంగా ఇంట్ల ముందు ఎవరు చెత్తను వేయరాదని ఏర్పాటు చేసిన తొట్టిలోనే వేయాలని ప్రజలకు కోరారు. ఎవరో వచ్చి వీధులు శుభ్రం చేస్తారని ఆరోగ్యాన్ని కాంక్షిస్తారని ఎదురు చూడాల్సిన అవసరం లేదని తెలిపారు. మన వీధిని మనమే పరిశుభ్రంగా ఉంచుకుందాం అంటూ పిలుపు నిచ్చారు. వీధుల్లో చెత్త పేరుకుపోయిందని తొలగించాలని ఎంపిడిఒకు విజ్ఞప్తి చేసిన వెంటనే నిర్లక్ష్యంగా తమ దగ్గర చెత్తకుప్పలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు లేవని చెప్పడంతో పంచాయతీ పాలకుల పట్టించుకోక పోవడంతో తాను స్వచ్ఛందంగా ఈ కార్యక్రమం నికి పూనుకున్నానని తెలిపారు. వదాన్యులు ఆశీస్సులు, తన మిత్రుల సహకారంతో పట్టణంలోని ప్రతి వీధిలో చెత్తకుండీలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నానని షర్ఫుద్దీన్ పేర్కొన్నారు. ఏర్పాటుపై పట్టణ ప్రజలు ప్రజాసేవా తత్పరుడు, సమాజానికి మేలు చేయాలన్న తలంపు గలిగిన యువకుడు షేక్ గాజుల షర్ఫుద్దీన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని హర్షం వ్యక్తం చేశారు.



ప్రయివేటు స్కూళ్లల్లో పాఠ్యపుస్తకాలు అమ్మొద్దు.. : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్మడం నేరమని ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వెన్ను వేణు అన్నారు. మంగళవారం మండలం లోని డేవిస్‌పేటలోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కార్పొరేట్ ప్రయివేట్ విద్యా సంస్థలైన శ్రీ చైతన్య పాఠశాలలో అక్రమంగా పాఠ్యపుస్తకాల పేరుతో పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తుందన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో అధికంగా ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, విద్యార్థులకు అవసరమైన అన్నింటినీ కూడా పాఠశాల యాజమాన్యం అమ్మడం దుర్మార్గం అన్నారు. విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారం దిశగా నడిపిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనట్లయితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విక్రమ్, దేవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు యగ్నేష్, దివేశ్, యశ్వంత్, బాబి, సుకుమార్, నాగేంద్ర, సంతోష్, దిలీప్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సీనియర్ జర్నలిస్ట్ నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-కావలి

కావలిలో సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు (65) సోమవారం రాత్రి 11.15 గంటలకు అనారోగ్యంతో చికిత్స పొందుతూ అకాల మరణం పొందారు. గత 40 సంవత్సరాలుగా ఆయన ఉదయం, వార్త, ఆంధ్రప్రభ పత్రికలలో పనిచేసి, ప్రస్తుతం వార్త దినపత్రికలో విలేకరిగా పనిచేశారు. కావలిలో "జర్నలిస్ట్ క్లబ్"ను ఏర్పాటు చేసేందుకు కృషి చేసి, ఎన్ని ఒడిదుడుకులెదురైనా, నిలదొక్కుకొని 6 సంవత్సరాలుగా క్లబ్ నిర్వహణలో ముందుండి నడిపారు. కాగా ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలను ఉన్నతంగా చదివించి, వివాహాలు చేసి బాధ్యతలు నెరవేర్చుకున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఘనంగా జరిగాయి. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కావలి ఎం.ఎల్.ఎ. కావ్యా క్రిష్ణా రెడ్డి నాగేశ్వరరావు మృతి తనను కలచివేసిందని, జర్నలిస్ట్‌గా ఆయన అందించిన సేవలు ఎనలేనివన్నారు.





నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

ఎం.ఎల్.సి., టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, మాజీ ఎంఎల్ఎలు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డి, జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ ఆళహరి సుధాకర్, బిజెపి పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటూరి శ్రీహరి, వామపక్ష నాయకులు పి.పెంచలయ్య (సిపిఎం), దామా అంకయ్య (సిపిఐ), దర్గా బాబు (సిపిఐ), కరవది భాస్కర్ (పిడిఎస్‌యు) ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు, రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, జర్నలిస్ట్ క్లబ్ సభ్యులు, తదితరులు ఓలేటి నాగేశ్వరరావు మృతికి తమ సంతాప, సానుభూతులను తెలియజేశారు.

జర్నలిస్ట్ క్లబ్ ఘన నివాళులు



సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్ట్ క్లబ్ వ్యవస్థాపకుల్లో ముఖ్యులు ఓలేటి నాగేశ్వర రావు అకాల మరణం పాత్రికేయ రంగానికి, జర్నలిస్టులకు తీరని లోటని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. మంగళవారం రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో నాగేశ్వరరావు చిత్రపటానికి జర్నలిస్ట్ క్లబ్ జర్నలిస్టులతో పాటు కావలి జర్నలిస్టులు అందరూ ఘన నివాళులు అర్పించారు.

ఓలేటి నాగేశ్వరరావు నేత్రదానం

ప్రజాశక్తి-కావలి



కావలికి చెందిన ప్రముఖ జర్నలిస్ట్ ఓలేటి.నాగేశ్వరరావు (65) సోమవారం రాత్రి 11.15 గంటలకు నాగేశ్వర రావు ఎనల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన నేత్రాలను కావలి అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఇ.వి.ఎస్.శ్రీవాణి, వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి.హేమలత సహకారంతో కుటుంబసభ్యులు వోలేటి.వెంకట సుధామాధురి అంగీకారంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు ఓలేటి.నాగేశ్వర రావు నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నేత్రాలను ఎల్.వి.ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. తరువాత సర్టిఫికెట్‌ను కూడా అందజేశారు. మరణానంతరం నేత్రదానం చేయడానికి 9959589321 సునీల్, 9494608060 శ్రీవాణి, అభయం స్వచ్ఛంధ సేవాసంస్థ సభ్యురాలు 9912470094 దుగ్గిశెట్టి.హేమలత వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు తెలియజేశారు.

ఎఫ్‌సిఐ గోడౌన్‌లో పరిశీలన

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం జాతీయ రహదారిపై ఉన్న రాష్ట్ర ప్రభుత్వ గిడ్డంగుల సంస్థల్లో మంగళవారం లేబర్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న హమాలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ లేబర్ యాక్ట్ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీల కోసం చేయడం జరిగిందని తెలిపారు. పనిలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రస్తుతం గోడౌన్‌లో 30మంది పనిచేస్తున్నారని వీరందరికీ ఈ శ్రమ గుర్తింపు కార్డులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తామని ప్రభుత్వం నుంచే అందాల్సిన బెనిఫిట్‌లో వారికి అందించే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. బోగోలు సిపిఎం నాయకులు తుమ్మల వెంకయ్య హమాలీల సమస్యలపై వెంకటేశ్వరరావు వినతి పత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు అజయ్ కుమార్ మాట్లాడుతూ శ్రామికుల శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నాడని, లేబర్ యాక్ట్ చట్టం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకొని వాటికోసం కలిసి పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు బోగోలు మండల బాధ్యురాలు రెహనా బేగం, మండల సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు కార్యదర్శి చల్లా నరహరి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపసాని రమేష్, సిపిఎం నాయకులు, గోడౌన్ సిబ్బంది, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను సన్మానించిన దృశ్యం



తహశీల్దారును కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన పద్మజాకుమారిని టిడిపి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి, దావా పెంచలరావు, టౌన్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, ఆత్మకూరు తెలుగు యువత మాజీ అధ్యక్షుడు చెరుకూరు తిరుపతి నాయుడు, మురగళ్ల మాజీ నీటి సంఘం అధ్యక్షుడు పచ్చా వెంగయ్య, నియోజకవర్గం వడ్డెర సాధికార కమిటీ కన్వీనర్ చల్లా మాల్యాద్రి, బోయల సిరివెళ్ల మాజీ సర్పంచ్ చెవుల వెంకటేశ్వర్లు, గొల్లపల్లి బూత్‌కన్వీనర్ ఇళ్ల మాధవ, బసవరాజుపాలెం బూత్ కన్వీనర్ దివానపు నరసింహా రావు, చింతల నరేష్, ఇల్లా మల్లికార్జున, ధర్మయ్య తదితరులున్నారు.

యోగాపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరులోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ రాములు ఆధ్వర్యంలో సిబ్బంది, వాహన డ్రైవర్లు యోగాసనాలు వేశారు. అనంతరం ఎంవీఐ రాములు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించుకోవాలని, పల్లెటూర్ల నుంచి మెయిన్ రోడ్డుకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు జాగ్రత్తగా గమనించి రావాలని సూచించారు. ట్రాక్టర్ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, కర్రలోడు, పొగాకు చెక్కల డోర్లు ఓపెన్ చేసి పొగాకు చెక్కు, ఉపాధి కూలీలను ఎక్కించి సైడ్ డోర్ లేకుండా వెళ్లకూడదని సూచించారు.

జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ /ఎఎస్‌పేట

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సూచనల మేరకు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు మంగళవారం తాత్కాలిక బారికేడ్లను ఏర్పాటు చేశారు. నెల్లూరు - ముంబాయి జాతీయ రహదారి ఎఎస్‌పేట క్రాస్ రోడ్డు సమీపంలో ఇటీవల వారం రోజుల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు జరగడం, ముగ్గురు మృతి చెందడమే కాక ఎంతో మంది గాయపడడంతో వెంటనే ఈ చర్యలు తీసుకున్నారు. ఆత్మకూరు సిఐ గంగాధర్ తమ సిబ్బందితో బారికేడ్ల ఏర్పాటును పర్యవేక్షించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, బారికేడ్ల ఏర్పాటుతో వేగ నియంత్రణ జరిగి ప్రమాదాలు తగ్గుముఖం పడుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు మంత్రి ఆనంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి కొడవలూరు

కొడవలూరు మండలం రేగడిచెలిక పంచాయతీలో కావలి డిఎల్‌పిఒ వెంకట్ రమణ మంగళవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెముకుల భాస్కర్ గత సంవత్సరం సెప్టెంబర్ 23 తేదీన లోకాయుక్తాలో పంచాయతీ నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు చేయడంతో పంచాయతీలో విచారణ జరిపామన్నారు. ఈ విచారణలో పలు రికార్డులను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారులకు విచారణ నివేదికను సమర్పిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి నారాయణరావు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కావలి

ఆనంద్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరుపాడు గ్రామంలో ఉన్న మధు వృద్ధాశ్రమంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధు వృద్ధాశ్రమం నిర్వాహకులు, ఆర్ఎంపి డాక్టర్ దామమధుసూదన రావు మాట్లాడుతూ గ్రామంలో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నందున, ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించినందుకు డాక్టర్ ఆనంద్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, నర్స్ అరుణ, పిఆర్ఒ శ్రీధర్ రెడ్డి, రవివర్మ, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-అనంతసాగరం



అనంత సాగరం మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జవర్ధనను అనంతసాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షులు రాపూర్ సుబ్బారెడ్డి, మర్యాద పూర్వకంగాకలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయకట్టు పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-విడవలూరు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీ గంగా సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అత్యంత వైభవంగా అర్చకులతో కోడి ముద్దలు, ధ్వజారోహణ పూజలు ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి నాయకులు బెజవాడ కృష్ణారెడ్డి, ఆవుల వాసు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి మల్లికార్జున్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.


వెన్నుపోటు పరిపాలనకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

ప్రజాశక్తి-కావలి

వెన్నుపోటు పరిపాలనకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని, కూటమి ప్రభుత్వంపై మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. కావలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కావలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి "జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం" పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చేసిన అబద్ధపు హామీల అమలు కోరుతూ ప్రజలకు అండగా నిలిచి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే వైసిపి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకం పేరుతో ఈ రాష్ట్రంలో ఐదు కోట్ల ఆంధ్రులను చంద్రబాబు మోసం చేశారన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారన్నారు. మొదట వెన్నుపోటుతోనే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. 2014లో ఎన్నికల్లో "బాబు వస్తేనే జాబ్ వస్తుందని ఇంటికో ఉద్యోగమని" ప్రచారం చేసుకొని కేవలం ఐదేళ్ల పాలనలో చంద్రబాబు 34వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి 3లక్షల 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి, ప్రజలకు సుపరిపాలన అందించారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు 143 హామీలను గుప్పించి, వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా దగా చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు జరిపే వరకు ప్రజలకు అండగా నిలిచి వైసిపి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి



వెంగమాంబ సన్నిధిలో రిటైర్డ్ అధికారి

ప్రజాశక్తి-దుత్తలూరు

భక్తుల కొంగు బంగారం నర్రవాడ శ్రీ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు సందర్భంగా అమ్మవారిని ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లి గ్రామస్తులు, కర్ణాటక రాష్ట్ర మాజీ ఐఎఎస్ఎస్ అధికారిణి బి.రాధా రమణ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి చల్లాల ప్రసాద్ అమ్మవారి ఆలయానికి ఆహ్వానించి అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

పలుచోట్ల ‘పొలం పిలుస్తోంది’



ఎఎస్‌పేటలో..

ప్రజాశకి-ఎఎస్‌పేట : మండలంలోని చిరమన, శ్రీకొలను గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆత్మకూరు వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ అధ్యక్షతన మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవసేనమ్మ మాట్లాడుతూ వరిలో మరియు మొక్కజొన్నలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉద్దేశాన్ని గురించి వివరించారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. ప్రకృతి వ్యసాయ సిబ్బంది సుబ్బరాయుడు, లక్ష్మి తిరుపతి, ఎఇఒ మునెమ్మ, విహెచ్ఎ సంధ్య, విఎఎ తులసి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని చెర్లోయడవల్లి, బట్టేపాడు రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయాధికారి కె.కిషోర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ 2025-26 ప్రతి సంవత్సరానికి గానూ ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల వంతున పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాలలో సాంకేతిక సలసాలు, వ్యవసాయ, అనుబంధ రంగాలలో సాంకేతిక సలహాలు, అనుబంధశాఖలు ప్రస్తుతం అందిస్తున్న సబ్సిడీలు, రాయితీలు రైతులకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం అందిస్తున్న సబ్సిడీ పచ్చిరొట్ట పైర్లు విత్తనాల వివరాలు, అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం, మట్టి నమూనాల సేకరణ, కిసాన్ డ్రోన్ల పథకాల గురించి రైతులకు వివరించారు. అనంతరం వరినారుమళ్లు పరిశీలించి రైతులతో చర్చించారు. కార్యక్రమంలో ఎఇఒ కె.పోలయ్య, విఎ బి శ్రీహర్ష, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని ఆలూరుపాడు రామన్నపాలెం పంచాయతీలలోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిణి యస్.విజయలక్ష్మి మంగళవారం నిర్వహించారు. వరిలో యాజమాన్యం పద్ధతులు ఆకునల్లి నివారణ గురించి ఆమె రైతులకు వివరించారు. అన్నదాత సుఖీభవ పథకానికి ప్రతిఒక్క రైతు ఈ కెవైసి చేయించుకుని ఆమె కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హత పొందిన ప్రతిఒక్క రైతు ఖాతాలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు మొత్తం రూ.20వేలు జమ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ అరుణ జ్యోతి, విఆర్ఒ రమేష్, ఎఇఒ వెంకట్రావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పృథ్వీ, నిహారిక, గ్రామ రైతులు పాల్గొన్నారు.